అన్నదాతలను అరిగోసపెడుతున్నారు

- బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్

వనపర్తి, అక్టోబర్ 27 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి రైతులను అరి గోస పెడుతుందని బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్ పేర్కొన్నారు. ప్రధానంగా రుణమాఫీని అరకొరగా చేసి వదిలేయడం, రైతుబంధును పూర్తిగా నిలిపివేయడంతో రైతుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంటున్నదన్నారు. ఆదివారం వనపర్తి మండలంలోని పెద్దగూడెం, కడుకుంట్ల, మెంటేపల్లి, దత్తాయిపల్లి, చందాపూర్, గుంతతండా, కీరియా తండా, అంకూర్, వెంకటాపూర్ గ్రామాల్లో ఈనెల 29వ తేదీ ఏర్పాటు చేసిన రైతు నిరసన సదస్సుపై సన్నాహక సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు సదస్సుకు భారీగా తరలిరావాలని, ఈ సదస్సు ప్రభుత్వానికి కళ్లు తెరిపించేలా ఉండబోతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నిక ముందు ఇచ్చిన హామీలను ప్రభుత్వం ఏర్పడాక ఎలాంటి పథకాలను అమలు చేయడం లేదన్నారు. వృద్ధులు కొండకు ఎదురు చూసిన ట్లుగా ఉన్నారని, మహిళలకు రూ.2500లు అడ్రస్ లేదని శ్రీధర్ పేర్కొన్నారు. మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగే ఈ రైతు నిరసన సదస్సుకు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొంటారని పేర్కొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వాకిటి శ్రీధర్

ప్రజలు ఈ సభకు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు మాణిక్యం, సింగిల్‌విండో అధ్యక్షుడు రఘువర్ధన్ రెడ్డి, నాయకులు ధర్మా నాయక్, నరేశ్, మాధవరెడ్డి, రాము, కొండన్న తదితరులు పాల్గొన్నారు.

రైతు నిరసన సదస్సును విజయవంతం చేయాలి

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్

రేవల్లి, అక్టోబర్ 27 : ఈనెల 29వ తేదీన వనపర్తిలో చేపట్టే రైతు నిరసన సదస్సును విజయవంతం చేయాలని వనపర్తి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు గట్టు యాదవ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎలాంటి పథకాలను అమలు చేయడంలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి పోయే కాలం దగ్గర పడిందని అయన విమర్శించారు. వనపర్తిలో చేపట్టే రైతు నిరసన సదస్సుకు రేవల్లి మండల నుంచి ప్రతిఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ భీమయ్య, నాయకులు శివరాంరెడ్డి, రాములు, కుర్మయ్య, కృష్ణయ్య, మాజీ ఎంపీటీసీ కుర్మతిరెడ్డి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న గట్టుయాదవ్

సభకు పెద్ద ఎత్తున తరలిరావాలి

పెబ్బేరులో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

పెబ్బేరు, అక్టోబర్ 27 : కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా వనపర్తిలో నిర్వహించే సభకు పెద్ద ఎత్తున్న ప్రజలు తరలిరావాలని పెబ్బేరు మున్సిపల్ వైస్‌చైర్మన్ మేకల కర్రెస్వామి కోరారు. బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు దిలీప్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం పలు వార్డుల్లో పర్యటించి ఆయన మాట్లాడారు. మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యం లో ఈనెల 29న వనపర్తి పట్టణంలో పాలకేంద్రం వద్ద జరిగే సభకు ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి హరీశ్‌రావు హాజరవుతారని, మండలం నుంచి ప్రతిఒక్కరూ తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సాయినాథ్, ఎల్లారెడ్డి, శేఖర్‌గౌడ్, సాయిరెడ్డి, వీపీ గౌడ్, గోవర్ధన్ రెడ్డి, వేణుగోపాల్ సంతోష్ పాల్గొన్నారు.

సభను విజయవంతం చేయాలి

పాన్‌గల్, అక్టోబర్ 27 : జిల్లాకేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించే రైతాంగ ప్రజా నిరసన సభను విజయవంతం చేయాలని మాజీ ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ లక్ష్మి, నాయకుడు చంద్రశేఖర్‌నాయక్ ఆదివారం సంయుక్త ప్రకటనలో కోరారు. ఈ సభకు మాజీ మంత్రి హరీశ్‌రావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. ఎన్నికల్లో అలివిగానీ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందన్నారు. సభకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధికసంఖ్యలో హాజరుకానున్నట్లు తెలిపారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలి

పాన్‌గల్, అక్టోబర్ 27 : విద్యార్థుల పెండింగ్ స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులు నరేందర్, భానుప్రకాశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఏళ్ల తరబడి స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో పేద విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.7,500 కోట్లకు పైగా బకాయి ఉన్నాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి దాదాపు ఏడాది కావస్తున్నా బకాయిలు చెల్లించడం లేదన్నారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్ బకాయిలు చెల్లించాలని, లేదంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.

నాగర్‌కర్నూల్‌కు తరలిన నాయకులు

నాగర్‌కర్నూల్ సభకు తరలివెళ్తున్న నాయకులు

గద్వాల(ఉండవెల్లి), అక్టోబర్ 27 : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఆదివారం మాలల ఆత్మగౌరవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సభకు అలంపూర్, ఉండవెల్లి, మానవపాడు, వడ్డేపల్లి మండలాల్లోని వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, ప్రజలు అలంపూర్ చౌరస్తాకు చేరుకొని 30 వాహనాల్లో తరలివెళ్లారు. కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు రంగముని, మునిస్వామి, రవికుమార్ ఉన్నారు.

పీఎం కిసాన్ నిధులు జమ కాక రైతుల ఇబ్బందులు

గట్టు, అక్టోబర్ 27 : పీఎం కిసాన్ నిధులు జమ కాక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గతం వరకు ఈ నిధులు రైతుల ఖాతాల్లో సక్రమంగా పడేవి. కొంతకాలంగా రైతులకు ఇదివరకు పడే బ్యాంక్ ఖాతాల్లో పడడంలేదు. దీంతో పీఎం కిసాన్ నిధులు తమకు సంబంధించి ఏ బ్యాంకు ఖాతాలో జమ అయ్యాయో తెలియక మండలంలో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. తాజాగా చాలా మంది రైతులకు నిధులు జమ కాకపోవడంతో పీఎం కిసాన్ స్టేటస్‌లో చూస్తే ఫోన్ నెంబర్ అప్‌డేట్ చేయించుకోమనే సమాధానం వస్తోందని రైతులు వాపోతున్నారు.

కాగా మండలంలో పీఎం కిసాన్ నిధులు జమకాక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంలో వ్యవసాయాధికారులు కల్పించుకొని తమ సమస్యలను పరిష్కరించాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

డ్రోన్లతో మందు పిచికారీ..!

- సమయం, డబ్బులు ఆదా
- టెక్నాలజీని ఉపయోగించుకుంటున్న రైతులు

డ్రోన్‌తో పంటకు మందు పిచికారీ చేస్తున్న ఆపరేటర్

వడ్డేపల్లి, అక్టోబర్ 27 : కాలం మారుతున్న కొద్ది అన్ని రంగాల్లో మార్పులు జరుగుతున్నాయి. ముఖ్యంగా వ్యవసాయ రంగంలో రైతులు డ్రోన్ల ద్వారా పొలాలకు మందును పిచకారీ చేయిస్తూ సమయాన్ని డబ్బును ఆదా చేసుకుంటున్నారు. కేవలం రూ.500తో ఐదు నిమిషాల్లో ఒక ఎకరా పొలానికి మందును పిచికారీ చేయించవచ్చు. ముఖ్యంగా వరి, కంది, మొక్కజొన్న, జొన్న పంటలకు పిచికారీ చేయడానికి ఎక్కువగా డ్రోన్లను ఉపయోగిస్తున్నారు. కొంకల గ్రామానికి చెందిన ప్రతాప్ అనే యువకుడు సుమారు రూ.5లక్షలతో డ్రోన్‌ను కొను గోలు చేసుకొని ఎకరానికి 500 ప్రకారం డబ్బులు తీసుకొని రైతుల పొలాలకు మందును డ్రోన్ల ద్వారా పిచికారీ చేయిస్తున్నాడు. తక్కువ ధరకే పిచికారీ చేస్తుండడంతో రైతు చాలా మంది దీనిని ఉపయోగించుకొని పంటలకు మందులు కొట్టిస్తున్నారు.

టెక్నాలజీని ఉపయోగించుకుంటున్న రైతులు

సమయం వృథా కాదు..

డ్రోన్‌ను కొను గోలు చేసి రైతు పొలాలకు దాని ద్వారానే మందు చల్లుతున్నాను. డ్రోన్ ను ఒక సారి చార్జ్ చేయడానికి 10 నిమిషాలు పడుతుంది. చార్జ్ చేస్తే 3 ఎకరాలకు పిచికారీ చేయవచ్చు. ఒక రోజు 30 ఎకరాలు పిచికారీ చేయడానికి వీలవుతుంది. రైతులకు మందు, సమయం వృథా కాదు. మందు కూడా పొలానికి మంచిగా పడుతుంది. ప్రభుత్వం డ్రోన్స్ సబ్సిడీ ఇస్తే రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది.

- ప్రతాప్, డ్రోన్ ఆపరేటర్, కొంకల, వడ్డేపల్లి మండలం

సబ్ కమిటీ సూచన మేరకే రైతు భరోసా

వనపర్తి టౌన్, అక్టోబర్ 27 : క్యాబినేట్ సబ్ కమిటీ సూచన మేరకే రైతు భరోసాను అమలు చేస్తామని వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. రైతుకు ఏడాదిలో రెండుమార్లు రైతు భరోసాను చెల్లించేందుకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో సబ్ కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందని, రిపోర్ట్ ఆధారంగా అసెంబ్లీలో చర్చించి 5ఎకరాల, 10 ఎకరాల అనే చర్చ అనంతరం వ్యవసాయ భూములకు మాత్రమే అమలు చేస్తామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శ్రీశైలం, వెల్లూరు, గుడిపల్లి, సింగోటం, కేఎల్ఐ ఎడమ, కుడి కెనాల్ ద్వారా సాగునీరు అందించామని, రైతులకు సాగునీరు అందించే బాధ్యత తమదేనని, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పూర్తికాకపోవడం వల్లనే నీరు అందించలేకపోతున్నామని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలపై, అభివృద్ధిపై ఎక్కడైనా చర్చకు సిద్ధమన్నారు. వనపర్తి జిల్లా లో 755 మంది రైతుల రుణమాఫీ పెండింగ్‌లో ఉందని సాంకేతిక కారణాల వల్ల పూర్తి చెయ్యలేదన్నారు. నియోజకవర్గంలో మాజీ మంత్రి అభివృద్ధిపై, భూముల అక్రమణలపై చర్చకు సిద్ధమా అని, ఆసియా ఖండంలో నే అతిపెద్ద సంత అయిన పెబ్బేరు సంతలో అక్రమణలో తమ ప్రమేయం లేదంటే తడిబట్టలతో వేణుగోపాలస్వామి గుడిలోకి రావాలని ఎమ్మెల్యే సవాలు విసిరారు. బుద్దారం, గణప సముద్రం రిజర్వాయర్లలో ల్యాండ్ అక్యువేషన్ చెల్లింపులు చేపట్టలేదని అన్నారు. అవినీతి, అభివృద్ధిపై తానెక్కడైనా ఎప్పుడైనా చర్చకు సిద్ధమేనని అన్నారు. రైతుల గురించి మాట్లాడే నైతిక హక్కు మాజీ మంత్రికి లేదని ఎమ్మెల్యే హితవు పలికారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీని వాస్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ మహేశ్, కృష్ణ, నాయకులు రహీం, కౌన్సిలర్లు ఉన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

కేటీఆర్ ఇంటిపై దాడి అమానుషం

- బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ పల్లయ్య

గద్వాల అర్బన్, అక్టోబర్ 27 : మాజీ మంత్రి కేటీఆర్ ఇంటిపై దాడి చేయడం అమానుషమని దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు బీఆర్ఎస్వీ జిల్లా కో-ఆర్డినేటర్ కుర్వ పల్లయ్య అదివారం ప్రకటనలో పేర్కొన్నారు. ఈ క్రమంలో ఆయన మాట్లాడుతూ ఎలాంటి కారణం, వారెంట్ లేకుండా సోదాలు ఎలా చేశారని ప్రశ్నించారు. ప్రతి పక్ష పార్టీ నేత ఇంటిపై పోలీసులు దుర్మార్గంగా వ్యవహరించడం కుట్రపూరితమని, ఎక్కడో ఎదో జరిగితే అది కేటీఆర్‌కి ఏం సంబంధమని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి సోదరులపై చాలా ఆరోపణలు వస్తున్నాయి. వారి ఇళ్లపై పోలీసులు ఇలాగే వ్యవహరించే ధైర్యం ఉందా అని ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. ప్రజా సొత్తున్ని కాపాడే మీరు ఈ విధంగా ప్రవర్తించడం వ్యవస్థకు మంచిది కాదని హితవుపలికారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేక కేటీఆర్‌పై దాడులు చేయడం సరికాదన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయలేకే డైవర్ట్ రాజకీయాలకు కాంగ్రెస్ ప్రభుత్వం తెరలేపిందన్నారు.

వీధిదీపాలు వెలుగక ఇక్కట్లు

గట్టు, అక్టోబర్ 27 : మండల కేంద్రంలో పలు వీధుల్లో దీపాలు వెలగడంలేదు. దీంతో ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. ఇటీవల గ్రామంలోని స్తంభాలకు వీధిదీపాలు అమర్చాలని, అయితే చాలా స్తంభాలకు సంబంధించిన వీధి దీపాలు అసలు వెలుగడంలేదని పలు దీపాలు చెబుతున్నారు. దీపావళి పండుగతో పాటు త్వరలోనే గట్టు జాతర ఉండనున్నదని, ఈ విషయంలో అధికారులు స్పందించి వీధిదీపాలు వెలగేటు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

పెద్దమందడి, అక్టోబర్ 27 : చేపల చెరువు కాపలాకు వెళ్లి విద్యుదాఘాతానికి గురై ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో శనివారం రాత్రి చోటుచేసుకున్నది. గ్రామస్థుల కథనం మేరకు మండలంలోని మద్దిగట్ల గ్రామానికి చెందిన వాకిటి పెద్ద మన్నెం కొండ(64) మత్స్యకార్మికుడు వెల్టూరు గ్రామ శివారులో బుగ్గి చెరువులో గ్రామ మత్స్యకారుల చేపలను పెంచుతున్నారు. చేపల చెరువు వద్ద కాపలా ఉండే వాకిటి పెద్ద మన్నెం కొండ రోజులాగే శనివారం రాత్రి భోజనం ముగించుకొని చెరువు వద్దకు వెళ్లాడు. చెరువు సమీపంలో ఉన్న వెల్టూరు గ్రామానికి చెందిన రైతు వడ్డె బాలయ్య వ్యవసాయ పొలం వద్ద ఉన్న విద్యుత్ స్తంభం దగ్గర విద్యుత్ తీగ కు తగిలి మన్నెంకొండ అక్కడికక్కడే మృతిచెందాడు. ఆదివారం ఉదయం మన్నెం కొండ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చెరువు వద్దకు వెళ్లి చూడగా అక్కడ విద్యుత్ ప్రమాదానికి గురై మృతిచెందాడు. మృతుడి కుమారుడు సురేశ్ గ్రామస్తులకు విషయం చెప్పడంతో మద్దిగట్ల మత్స్య సహకార సంఘం ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ నారాయణ, సంఘం సభ్యులు అక్కడికి వెళ్లి మత్స్యశాఖ అధికారులకు సమాచారమిచ్చారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఏరియా దవాఖానకు తరలించారు. మృతుడికి భార్య వెంకటమ్మ, ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉన్నారు. మృతుడి కుమారుడు సురేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మన్నెంకొండ (ఫైల్)

రెక్కాడితే గానీ డొక్కాడని పరిస్థితిలో ఉన్న మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకోవాలని మత్స్య సహకార సంఘం నాయకులు, గ్రామస్తులు ప్రభుత్వాన్ని, ఎమ్మెల్యే మేఘారెడ్డిని కోరారు.

అంకితభావంతో పనిచేసే వారికి సత్కారాలు

వనపర్తి టౌన్, అక్టోబర్ 27 : వృత్తి పట్ల అంకితభావంతో పనిచేసే వారికి ఎప్పటికీ సత్కారాలు ఉంటాయని డీఈవో గోవిందరాజులు అన్నారు. వనపర్తి మండలంలోని చిట్యాల తూర్పుతండాలోని ప్రాథమిక పాఠశాలలో పనిచేసిన ఉపాధ్యాయులు రాయిని పల్లి శ్రీని వాస్, రమేశ్‌లు ఇటీవల బదిలీపై వెళ్లారు. వారిని పాఠశాల పూర్వ విద్యార్థులు, గ్రామస్థులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి డీఈవో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ అంకితభావంతో పనిచేసి వందశాతం ఉత్తీర్ణత, గురుకుల సీట్లు సాధించడం, విద్యార్థుల భవిష్యత్తు సూచనలు, సలహాలు అందించడం వల్ల పూర్వ విద్యార్థులు, గ్రామస్తుల అభిమానాన్ని చురగొన్నారని పేర్కొన్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు తమవంతు కృషి చేసిన ఉపాధ్యాయులందరికీ ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం గణేశ్‌కుమార్, చంద్రశేఖర్, ఎంఈవో శ్రీనివాస్‌గౌడ్, వివిధ సంఘాల నాయకులు మహిపాల్‌రెడ్డి, శ్రీని వాసరావు, విజయ్‌కుమార్, విష్ణువర్ధన్ రెడ్డి, దర్గయ్య, బాలరాజు, గ్రామస్తులు ఠాగూర్, గోపాల్, బాలు, హన్మంతు, కిషన్, నారమ్మ, పూర్వ విద్యార్థులు ఉన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో

పది నెలలుగా అరిగిన పాత రికార్డే..

- తప్పులుంటే చర్యలు ఎందుకు తీసుకోరు
- ఆరోపణలతోనే పబ్బం గడుపుతున్న ఎమ్మెల్యే

సమావేశంలో మాట్లాడుతున్న నందిమళ్ల అశోక్

వనపర్తి, అక్టోబర్ 27(నమస్తే తెలంగాణ) : వనపర్తి ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి ఒకే పాత రికార్డు అన్నట్లుగా పదే.. పదే అబద్దాలను చెబుతూ కాలం గడుపుతున్నారని బీఆర్ఎస్ జిల్లా మీడియా సెల్ కన్వీనర్ నందిమళ్ల అశోక్ పేర్కొన్నారు. నిజంగా తప్పులుంటే మీ ప్రభుత్వమే ఉంది ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఇప్పటి వరకు ఎలాంటి అభివృద్ధి చేయనందునా ప్రజలు ఎక్కడ ప్రశ్నిస్తారోనన్న అభద్ర తాభావంతో ఎమ్మెల్యే నిరాధార ఆరోపణలతో గడుపుతున్నాడని విమర్శించారు. ఆదివారం ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డిపై పలు ఆరోపణలు గుప్పించారు. దీనిపై అశోక్ మాట్లాడుతూ ఈనెల 29 ఏర్పాటు చేసిన రైతుల నిరసన సదస్సుకు అనూహ్య స్పందన వస్తున్నదని, ఇది చూసి ఓర్వలేక వ్యక్తిగతంగా మాట్లాడతున్నారని పేర్కొన్నారు. ఇవే ఆరోపణలు 2018 ఎన్నికల్లోనూ అప్పుడు చిన్నారెడ్డి చేశారని, వాటినే మళ్లీ మీరు కూడా చేస్తూ వస్తున్నారే తప్పా మరొకటి లేదన్నారు. అధికారం చేతిలో పెట్టుకుని పసలేని ఆరోపణలు చేయడమంటే ప్రజలను తప్పుదారి పట్టించడం కోసమేనన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఏమాత్రం చేయని కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని,కేవలం అరకొరగా రుణమాఫీ చేసి చేతులు దులుపుకున్నారన్నారు.రైతు భరోసాకు పూర్తిగా ఎగనామం పెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నట్టేట ముంచిందన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం ఒక్క పని చేయని ఎమ్మెల్యేకు, కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు చేసిన మా నాయకుడిని విమర్శించే నైతికత లేదన్నారు. ఏపని చేయకుండా పదే.. పదే తడి బట్టలతో ప్రమాణం చేయాలంటున్న మీరు సమయం.. తేదీని కూడా ప్రకటిస్తే.. మా నాయకుడు సిద్ధమేనని, అనంతరం మీ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉన్నారా చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ యువత అధ్యక్షుడు సూర్యవంశం గిరి, జిల్లా విద్యార్థి కో ఆర్డినేటర్ హేమంత్, గోర్ల ప్రేమ్‌కుమార్ ఉన్నారు.

ప్రచారమే మాకు ముఖ్యం

- ఇష్టానుసారంగా వెలుస్తున్న ఫ్లెక్సీలు
- పట్టించుకోని అధికారులు
- భయం గుప్పిట్లో ప్రజలు

మున్సిపల్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

గద్వాల టౌన్, అక్టోబర్ 27 : జిల్లా ప్రధాన రోడ్ల వెంబడి, మహనీయుల విగ్రహాలకు అడ్డుగా, ప్రభుత్వ పథకాల ప్రచారాలకు అడ్డుగా ఇలా ఎక్కడా ఫ్లెక్సీలు పెట్టవద్దని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. అలాగే రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు ఉంటాయని ఆదేశాలు ఇచ్చింది. అయినా ఇవన్నీ తమకు పట్టవన్నట్లుగా అభిమానులు, వ్యాపార సంస్థలు నిర్వహించే వారు, రాజకీయ నాయకులు వ్యవహరిస్తున్నారు. మా ప్రచారమే మాకు ముఖ్యమని ఎక్కడ పడితే అక్కడ ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు. ఫెక్సీలు ఏర్పాటు చేయాలంటే మున్సిపాలిటీ అనుమతి తప్పనిసరి కానీ ఎలాంటి అనుమతులు లేకుండానే తమకు నచ్చిన చోటు ఎంచుకొని ఫ్లెక్సీలు పెట్టేస్తున్నారు. ఇష్టానుసారంగా వెలుస్తున్న ఫ్లెక్సీల వంక అధికారులు చూసీచూడనట్లుగా ఉంటున్నారు. ప్రధాన రహదారుల గుండా జిల్లా స్థాయి ఉన్న తాధికారులు రాకపోకలు సాగిస్తున్నా వారు కూడా మాకెం దకులే అన్నట్లుగా పోతున్నారు. దీంతో వాహన దారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఫ్లెక్సీల కారణంగా ఎదురుగా వచ్చే వాహనాలు కని పించక నానా అవస్థలు పడుతున్నారు. కరెంట్ స్తంభాలకు ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీలు ఎప్పుడు తమ వాహనాలపై పడ తాయోనని భయం భయంగా ప్రయాణిస్తున్నారు. ఫ్లెక్సీల తొలగింపుపై అధికారులు వ్యవహరిస్తున్న నిర్లక్ష్యంపై పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

స్పందన కరువు..

గత నెలలో గాలివానలకు ఫ్లెక్సీలు విరిగి పడి పలువురికి గాయాలయ్యాయి. దీంతో అప్పటికప్పుడు కంటి తుడుపు చర్యగా అధికారులు ఆగమేఘాల మీద కొన్ని ఫ్లెక్సీలు తొలగించారు. కానీ మిగతా ఫ్లెక్సీలు మాత్రం తొలగించలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఫెక్సీలను తొలగించి ఏర్పాటు దారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★హైదరాబాద్ & తెలంగాణ జిల్లాల్లోని ప్రముఖ టెలికాం టవర్ కంపెనీలో పనిచేయడానికి డిప్లొమా/ ITI చదివిన ఎలక్ట్రీషియన్లు కావలెను. ఫోన్: 8008345353.

MBNR-NT-98842

ప్రకటన

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777748